సంపుటి :02 సంచిక :230 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

బుధవారం 12, సెప్టెంబర్ 2025



## సినీ స్టార్ నాగార్జునకు మంత్రి సురేఖ క్షమాపణలు

- గతంలో నేను ఉద్దేశ పూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదు
- నా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా
- ఎక్స్ ద్వారా ప్రకటించిన మంత్రి

04

## హైకోర్టులో కేసీఆర్ కు ఊరట

- కాళేశ్వరం కేసుపై న్యాయస్థానం విచారణ
- కేసీఆర్, హరీశ్, జోషి, సబర్వాల్ చర్యలపై మధ్యంతర ఉత్తర్వుల కొనసాగింపు
- విచారణ జనవరికి వాయిదా

02





# సీతాకోకచిలుకల సింగిడి

### ఏటూరునాగారం అభయారణ్యంలో అధ్యయనం

- వరల్డ్ వైల్డ్ ఫర్ నేచర్ సంస్థ పరిశోధన
- మూడురోజుల పాటు 60 మంది బృందం పర్యటన
- 80 అరుదైన జాతుల బటర్ ఫ్లైస్ గుర్తింపు
- జీవవైవిధ్యం పరిఢవిల్లుతుందని ప్రకటన
- ఫలిస్తున్న అటవీశాఖ కార్యాచరణ

జీవవైవిధ్యానికి ప్రతీక. వందలాది రకాల జీవ జాతులకు ఆలవాలం. వేలాది వృక్ష జాతులకు పెట్టింది పేరు. ఒక రకంగా చెప్పాలంటే ఈ అటవీ ప్రాంతం ఒక్క ఈ జిల్లాకే కాకుండా చుట్టుపక్కల జిల్లాలకూ ఊపిరి తిత్తుల్లాంటివి. కాలుష్యం బారి నుంచి మానవాళిని కాపాడే సంజీవని లాంటివి. పక్షుల నుంచి క్షీరదాల వరకు అన్ని ప్రాణులకు ప్రాణవాయివును అందించే ఆరోగ్యగని. అలాంటి అటవీ ప్రాంతం గురించి తాజాగా ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఏటూరునాగారం వన్యప్రాణుల అభయారణ్యంలో సుమారు 80 రకాల అరుదైన సీతాకోక చిలుకలు ఉన్నట్లు వరల్డ్ వైల్డ్ ఫర్ నేచర్ సంస్థ గుర్తించింది. ఆ..... గుర్తిస్తే ఏంటంట..? అని తీసిపారేయకండి. ఆ జాతులు ఉండటం జీవవైవిధ్యం పరిఢవిల్లుతుందనడానికి సంకేతం. ఇంతకీ ఆ విశేషాలెంటో తెలుసుకుందామా!

– అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి

04




## రైస్ మిల్లర్ల అక్రమాలు

- కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ధర్నా
- తరుగు పేరుతో రైతులను దోపిడీ చేయెద్దని డిమాండ్

03

## డెడ్ లైన్ డిసెంబర్ 20

03



- ప్రగతిని పరిశీలించేందుకు ఈ నెల 22న మళ్లీ వస్తాం
- అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- నాణ్యతలో రాజీపడేది లేదు. తేడా వచ్చినా ఉపేక్షించేది లేదు
- అధికారులతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి
- మంత్రులు సురేఖ, సీతక్క, లక్ష్మణ్ తో కలిసి మేడారంలో అభివృద్ధి పనుల పరిశీలన

## టీజీఎంసీకి చిక్కిన ఇద్దరు నకిలీ వైద్యులు

- కరీమాబాద్‌లో రెండు క్లినిక్‌ల్లో దాడులు
- పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్లపై కేసులు నమోదు

03



# డీజీపీ నుంచి ప్రశంస పత్రాన్ని అందుకున్న పీఆర్ఓ



అక్షరదర్బార్, హనుమకొండ: తెలంగాణ పోలీస్ సురక్ష ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ పీఆర్ఓలకు హైదరాబాద్ సిటీ పోలీస్ శిక్షణ కేంద్రంలో మూడు రోజుల పాటు నిర్వహించిన పీఆర్ఓ శిక్షణ శిబిరంలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వరంగల్ పోలీస్ కమిషనరేట్ పీఆర్ఓ మన్నవ మోహనకృష్ణను అభినందిస్తూ రాష్ట్ర తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తన చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఐజీ ఎం రమేష్ రెడ్డితో పాటు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# హైకోర్టులో కేసీఆర్ కు ఊరట

- కాళేశ్వరం కేసుపై న్యాయస్థానం విచారణ
- కేసీఆర్, హరీశ్, జోషి, సబర్వాల్ చర్యలపై మధ్యంతర ఉత్తర్వుల కొనసాగింపు
- విచారణ జనవరికి వాయిదా



అక్షరదర్బార్, హైదరాబాద్: హైకోర్టులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ఊరట దక్కింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి సంబంధించిన అవకతవకలపై న్యాయ విచారణ నివేదిక ఆధారంగా చర్యలకు తాత్కాలికంగా నిలిపివేస్తూ హైకోర్టు నిర్ణయం తీసుకుంది. ఈ గడువును జనవరి వరకు పొడిగించింది.

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో అక్రమాలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ప్రధాన కార్యదర్శి శైలేంద్రకుమార్ జోషి, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వాన్ని అడ్డుకుంటూ హైకోర్టు మధ్యంతర ఆదేశాలను జనవరి 2026 వరకు పొడిగించింది. బుధవారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేష్ కుమార్‌సింగ్, న్యాయమూర్తి జీఎం మొయిద్దీన్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ప్రభుత్వ తరఫు న్యాయవాది కౌంటర్ అఫిడవిట్లు సమర్పించేందుకు మరికొంత సమయం కోరగా, కోర్టు అందుకు అంగీకారం తెలిపింది. తదుపరి విచారణను జనవరి నెలకు వాయిదా వేసింది. కేసీఆర్, హరీశ్‌రావు, జోషి, సబర్వాల్ చర్యలు ఇప్పటికి వద్దంటూ ఇంతకుముందు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను కొనసాగిస్తున్నట్లు తెలిపింది. మరోవైపు కాళేశ్వరం అవకతవకలపై రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే సీబీఐ దర్యాప్తు చేపట్టాలని కోరిన విషయం తెలిసిందే.



# నిర్లక్ష్యపు ఛాయల్లో పరకాల

- జిల్లా స్థాయి అర్హత ఉన్నా ప్రగతికి ఆటంకం
- చరిత్ర గల పట్టణం అభివృద్ధిలో వెనుకబాటు
- అన్ని రంగాల్లో ప్రగతికి ఎమ్మెల్యే చొరవే కీలకం!



చారిత్రక నగరానికి వెలుగు నిచ్చేదెవరు? చరిత్ర కలిగిన, భౌగోళికంగా కీలకమైన పరకాల పట్టణం దశాబ్దాలుగా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధిలో వెనుకబడి ఉంది. సుమారు 60 ఏళ్ల క్రితమే మున్సిపాలిటీగా ఏర్పడి, పూర్వ వరంగల్ జిల్లాలోని దాదాపు 100 గ్రామాలకు కేంద్రంగా ఉన్న పరకాల, తెలంగాణ ఏర్పడ్డాక జిల్లా కేంద్రంగా మారేందుకు అన్ని వనరులున్నా ఆ అవకాశం కోల్పోయింది. గత పాలకుల దూరదృష్టి లోపించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని సీనియర్ సిటిజన్ మార్త బిక్షపతి సహా స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అక్షర దర్బార్, పరకాల

### రవాణా విస్తరణతో పట్టణానికి కొత్త ఊపు

ప్రస్తుతం పరకాల పట్టణం హుజురాబాద్, ములుగు, హనుమకొండలకు మధ్య కేంద్రస్థానంగా ఉండడంతో రవాణా వ్యవస్థ మెరుగుపడుతోంది. హుజురాబాద్ నుండి పరకాల వరకు ఫోర్ లైన్ పూర్తైంది. అలాగే నాగపూర్–పరకాల మీదుగా గ్రీన్ వే లైన్ పనులు కూడా మొదలయ్యాయి. ఎర్రగట్టు గుట్ట-అంబాల మీదుగా, దామెర–వెలంపల్లి మీదుగా పరకాల వరకు ఫోర్ లైన్ పనులు, గూడెప్పాడు నుండి చెల్పూర్ వరకు రహదారి పనులు పురోగతిలో ఉన్నాయి. పట్టణంలో ఆర్డీఓ, రిజిస్ట్రేషన్, విద్యుత్ శాఖ కార్యాలయాల ఏర్పాటుతో పాటు మెరుగైన రహదారి సౌకర్యాలు పరిశ్రమలు, విద్యా సంస్థల ఏర్పాటుకు దోహదపడతాయి.

### అత్యవసర రహదారి సమస్యల పరిష్కారం

రవాణా మెరుగుదలతో పాటు, కీలకమైన రహదారుల సమస్యల పరిష్కారం తక్షణావసరం. బొగ్గు లోడ్ల వలన ప్రమాదకరంగా మారిన గుడపాడ్–భూపాలపల్లి రహదారికి ప్రత్యామ్నాయంగా, చిట్యాల మార్గంలో చలివాగు, కనిపర్తి మీదుగా రహదారి నిర్మిస్తే దూరం, ప్రమాదాలు తగ్గుతాయి. అంతేకాక, బస్టాండ్ నుండి జయ టాకీస్ వరకు, అక్కడి నుండి నాగారం–పైడిపల్లి వరకు సుమారు 3 కి.మీ. రహదారిని వేగంగా పూర్తిచేయాలని, తద్వారా చిట్యాలకు ప్రయాణం సులభతరం చేయాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, డ్రైనేజీ పనులకు ముందు జయ టాకీస్ రహదారిని వెడల్పు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### విద్య, వైద్య రంగాల విస్తరణపై దృష్టి సారించాలి

పట్టణ ప్రగతికి ఊతమిచ్చే విద్య, వైద్య రంగాల విస్తరణ కీలకం. వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులు పూర్తికావొస్తున్నాయి. దీనికి తోడు, పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కాలేజీగా అప్‌గ్రేడ్ చేయడం, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, ఐటీఐలను మంజూరు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే సుమారు ₹200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నాణ్యమైన విద్య, వైద్య సేవలు స్థానికంగా అందుబాటులోకి వస్తాయి. నర్సంపేటను అభివృద్ధి చేసిన విధంగా, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి వ్యక్తిగత చొరవ తీసుకుని పరకాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలని, ముఖ్యంగా బస్టాండ్ నుండి పైడిపల్లి వరకు రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

### అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి



"గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పరకాల పట్టణం అభివృద్ధికి నోచుకోలేదు. జిల్లా కేంద్రంగా మారేందుకు అన్ని భౌగోళిక, ఆర్థిక వనరులు ఉన్నప్పటికీ, నాయకులు పట్టించుకోలేదు. ప్రస్తుత శాసనసభ్యులు దూరదృష్టితో వ్యవహరించి పరకాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలి." -మార్త బిక్షపతి సీనియర్ సిటిజన్

## చలి తీవ్రత పెరిగింది.. ఆరోగ్యం పదిలం!


### వెచ్చటి దుస్తులు ధరించండి: డాక్టర్ శ్రీకాంత్



అక్షర దర్బార్, వెంకటాపూర్ : రోజురోజుకూ పెరుగుతున్న చలి తీవ్రత దృష్ట్యా ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటాపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, చలి తీవ్రతను తట్టుకునేందుకు శరీరానికి వెచ్చటి దుస్తులు ధరించాలని, గోరువెచ్చటి నీటిని మాత్రమే తాగాలని ప్రజలకు సూచించారు. ప్రత్యేక శ్రద్ధ అవసరం: అస్తమా, శ్వాసకోశ వ్యాధులు ఉన్నవారు చలికి గురికాకుండా, చలిలో తిరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో గురక సమస్య ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పీహెచ్‌సీకి తీసుకువచ్చి చికిత్స అందించాలని కోరారు. మండలంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డాక్టర్ శ్రీకాంత్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీ లేక విద్యార్థులకు పాముల భయం

### కేసముద్రం పెనుగొండ ప్రాథమిక పాఠశాలలో ఇక్కట్లు



అక్షర దర్బార్, కేసముద్రం : మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు నిత్యం పాముల భయం గుప్పిట్లో చదువుకోవాల్సిన దుస్థితి నెలకొంది. పాఠశాలకు ప్రహరీగోడ లేకపోవడం మరియు చుట్టూ పంట పొలాలు ఉండటంతో తరగతి గదుల్లోకి విషసర్పాలు చొరబడుతున్నాయని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలకు కొత్త భవనం అందుబాటులోకి వచ్చినప్పటికీ, ప్రహరీ లేకపోవడంతో ఆ పరిసరాలు కీటకాలకు, విషసర్పాలకు నిలయంగా మారాయి. ఇటీవల ఐదవ తరగతి విద్యార్థిని తరగతి గదిలో పామును చూసి భయంతో స్పృహ తప్పి పడిపోయింది. వెంటనే ఉపాధ్యాయులు ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.



## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

### నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ సూచన

అక్షర దర్బార్, నల్లబెల్లి : ఈ నెల 15న నర్సంపేట కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లబెల్లి ఎస్సై వి. గోవర్ధన్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కోర్టుల చుట్టూ తిరగడం వల్ల మానసికంగా, ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని అన్నారు. కేసుల పరిష్కారం: క్రిమినల్ కాంపౌండబుల్, సివిల్, ఆస్తి తగాదాలు, కుటుంబపరమైన వైవాహిక వివాదాలు వంటి రాజీ పడదగిన కేసుల్లో లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. తరతరాలుగా కేసుల చుట్టూ తిరుగుతూ కుటుంబ వ్యవస్థ కుంటుపడకుండా ఉండేందుకు రాజీపడడమే ఉత్తమ మార్గమని ఎస్సై స్పష్టం చేశారు. ఇరువర్గాలు రాజీపడటం వల్ల సమస్య పరిష్కారంతో పాటు కక్షిదారుల విలువైన సమయం, డబ్బు ఆదా అవుతాయని వివరించారు.



# టీజీఎంసీకి చిక్కిన ఇద్దరు నకిలీ వైద్యులు

- కరీమాబాద్‌లోని క్లినిక్‌లపై టీజీఎంసీ దాడులు
- పలు సెక్షన్లపై కేసులు నమోదు

అక్షరదర్బార్, వరంగల్ : ప్రజారోగ్యంపై అడ్డగోలుగా ఇంజెక్షన్లు వేస్తూ చెలగాటం ఆడుతున్న ఇద్దరు నకిలీ వైద్యులను తెలంగాణ వైద్య మండలి (టీజీఎంసీ) పట్టుకున్నది. టీజీఎంసీ చైర్మన్ డాక్టర్ కే మహేష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ డి. లాలయ్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌లోని కరీమాబాద్‌కు చెందిన గద్దం హరీశ్ అనే అనే నకిలీ వైద్యుడు నాలుగు నెలలుగా నకిలీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నడుపుతున్నాడు. గర్భిణులకు ప్రమాదకరమైన స్టెరాయిడ్ ఇంజెక్షన్లు ఇస్తున్నాడు. మరొక నకిలీ వైద్యుడు గద్దం శ్రీనివాస్ అదే ప్రాంతంలో 15 నుంచి 20 సంవత్సరాలుగా జంటామైసిన్, డైక్లోఫెనాక్ వంటి ప్రమాదకర ఇంజెక్షన్లు వినియోగించి వైద్యం చేస్తున్నాడు. బుధవారం టీజీఎంసీ అధికారులు, సిబ్బంది వారి క్లినిక్‌ల్లో దాడులు నిర్వహించారు. వారిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్ పలు సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయించారు. కాగా బుధవారం కూడా గద్దం శ్రీనివాస్, హరీశ్ ఆసుపత్రులు యధావిధిగా పనిచేశాయని స్థానికులు కొందరు అధికారుల దృష్టికి తెచ్చారు. దాడుల్లో టీజీఎంసీ సభ్యుడు, పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నరేష్ కుమార్ వేములపల్లి, డాక్టర్ ఎస్ శిరీష్ కుమార్, డాక్టర్ ఎం.దిలీప్ కుమార్, వైద్య మండలి లీగల్ సభ్యులు, యాంటీ క్వాకరీ కమిటీ వరంగల్ శాఖ సభ్యులు పాల్గొన్నారు. కాగా గద్దం



శ్రీనివాస్ హరీష్ ఆసుపత్రులు బుధవారం కూడా యధావిధిగా పని చేసినట్లు స్థానికులు కొందరు అధికారుల దృష్టికి తెచ్చారు.

# 'బేటీ బచావో'పై అవగాహన

## బాల్య వివాహాలు అరికట్టడం అందరి బాధ్యత: ఎంపీడీవో

అక్షర దర్బార్, మరిపెడ : మహబూబాబాద్ జిల్లా, మరిపెడ ఎంపీడీవో కార్యాలయంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో "బేటి బచావో - బేటి పడావో" మరియు బాల్య వివాహాల చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వేణుగోపాల్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని, ప్రతి గ్రామంలో ఇటువంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నలమాస అరుణ బాల్య వివాహాల




చట్టాల గురించి వివరించారు. బాలల పరిరక్షణ విభాగం నుండి వీరన్న పోక్సో చట్టం, పిల్లల అక్రమ రవాణా గురించి తెలియజేశారు. అలాగే, బాలల రక్షణ కోసం ఉద్దేశించిన హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 181, 100, 1930 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, పంచాయత్ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మహిళా సాధికారత సిబ్బంది, సఖి కేంద్రం సభ్యులు పాల్గొన్నారు.



# శాంతి భద్రతలపై మోడీ సర్కార్ వైఫల్యం

## ఉగ్రవాదం అరికట్టడంలో విఫలం: ఎంసీపీఐ(యు)

అక్షర దర్బార్, వరంగల్ : దేశంలో శాంతి భద్రతలను పరిరక్షించి, ఉగ్రవాదాన్ని అరికట్టడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. వరంగల్‌లో జరిగిన పార్టీ నగర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల తొలగింపుపై ఆందోళన: కేంద్రం 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' పేరుతో బీజేపీ వ్యతిరేక ఓటర్లను తొలగించేందుకు ప్రయత్నిస్తూ రాజ్యాంగ ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తోందని రమేష్ విమర్శించారు. ఢిల్లీలో ఉగ్రవాదులు బాంబులు పేల్చి ప్రజల ప్రాణాలు బలిగొంటున్నా ప్రభుత్వానికి స్పృహ లేదన్నారు. వరంగల్ ముంపు: రాష్ట్ర ప్రభుత్వం కూడా వరంగల్‌ను రెండో రాజధానిగా తీర్చిదిద్దుతామని చెప్పి, కనీసం వర్షాల ముంపు నుంచి కూడా రక్షించలేకపోతోందని నగర కార్యదర్శి మాలోత్ సాగర్ విమర్శించారు. వరంగల్ అభివృద్ధికి తక్షణమే నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



# డెడ్ లైన్ డిసెంబర్ 20

- ప్రగతిని పరిశీలించేందుకు ఈ నెల 22న మళ్లీ వస్తాం
- అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- నాణ్యతలో రాజీపడేది లేదు. తేడా వచ్చినా ఉపేక్షించేది లేదు
- అధికారులతో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి
- మంత్రులు సురేఖ, సీతక్క, లక్ష్మణ్ తో కలిసి మేడారంలో అభివృద్ధి పనుల పరిశీలన





అక్షరదర్బార్, మేడారం: శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టి ఎట్టిపరిస్థితుల్లోనూ డిసెంబర్ 20 లోగా పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, ఎస్సీ, ఎస్టీ, గిరిజన సంక్షేమ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజుకు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరిష్ పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీ పోరిక బలరాంనాయక్ లు మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత శ్రీ సమ్మక్క సారలమ్మ దేవాలయం అభివృద్ధి పనులను మంత్రులు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం మంత్రులు మేడారంలోని హరిత కాకతీయ హోటల్ లో ఎంపీ పోరిక బలరాంనాయక్ లతో కలసి సంబంధిత శాఖల ఉన్నత స్థాయి అధికారులు, గుత్తేదార్లతో మేడారం జాతర అభివృద్ధి పనుల పురోగతి, మాస్టర్ ప్లాన్ రూపకల్పనపై కూలంకషంగా సమీక్షించి సమర్ధవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మేడారంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై, ప్రాకారం లోపల, సివిల్ పనులు, గద్దెల ఎత్తు పెంచడం, నిర్మాణం , ప్రధాన ద్వారాలు, ఆర్చ్, 4 వాచ్ టవర్లు, ప్రాకారనికి చుట్టూ సీసీ రోడ్డు పనులను సమాంతరంగా చేపట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. దీనికితోడు గ్రీనరీ, ప్లాంటేషన్ చేయాలన్నారు. కావలసిన గ్రానైట్ వేగవంతంగా తెప్పించుకోవాలని అన్నారు. మెన్ మెటీరియల్ పెంచి 24 గంటలు పనులు జరగాలన్నారు. మేడారంలో రోడ్డు నిర్మాణ పనులు డివైడర్లు, ప్లాంటేషన్ తో సహా నెల రోజుల్లో పూర్తి కావాలి. మాస్టర్ ప్లాన్ లో భాగంగా మొదటి విడతలో క్యూ లైన్ షెడ్స్, 4 లేన్ల లైన్ల విస్తరణ, టెంపర్ అభివృద్ధి, గద్దెల వద్ద భక్తుల కెపాసిటీ 3 వేల నుండి 10 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. 19 ఎకరాలు భూ సేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి కోరిన విధంగా జంపన్న వాగుపై చెక్ డ్యామ్ ల ఏర్పాటుకు ఇరిగేషన్ అధికారులు తక్షణమే ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. శాశ్వత బస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదించాలని, పర్యాటక శాఖ ద్వారా జంపన్న వాగు అభివృద్ధి, సుందరీకరణ ప్రతిపాదనలు సిద్ధం చెయాలన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా 4 అధునాతన పశు వదశాలల ఏర్పాటు చేయాలని అన్నారు. మేడారం చుట్టుప్రక్కల రహదారులకు మరమ్మతులు చేయాలి. మేడారంకు వచ్చే ప్రధాన రహదారిలో ఎలాంటి అడ్డంకులు ఉండకుండా ప్రధాన రహదారిలో అక్కడక్కడ మిగిలి ఉన్న పనులతో పాటు మల్లంపల్లి బ్రిడ్జి, కటాక్షపూర్ బ్రిడ్జిపై ప్రత్యేక శ్రద్ధ చూపి డిసెంబర్ 15 లోగా పూర్తి కావాలని నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల ప్రగతిని పరిశీలించేందుకు ఈ నెల 22న వస్తామని, నిర్దేశిత ఆయా పనులు పూర్తి కావాలని అన్నారు. నాణ్యతలో రాజీపడేది లేదని, తేడా వస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మినిస్టర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ కేఎస్ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్ హరీష్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ శబరిష్, డీఎఫ్ ఓ రాహూల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్ అండ్ బీ, పీఆర్ ఈఎన్ సీ, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, పూజారులు, జిల్లా అధికారులు, ఆర్కిటెక్చర్, గుత్తేదారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# యువకుడికి ఒకేసారి రెండు కేంద్ర కొలువులు

## రైల్వే జేఈ, ఎన్‌టీపీసీ ఈఈగా భావ్ సింగ్ ఎంపిక



అక్షర దర్బార్, మరిపెడ: మరిపెడ మండలం, తానంచర్ల ఉమ్మడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఆముదాలగడ్డ తండాకు చెందిన ధారావత్ భావ్ సింగ్ ఒకేసారి రెండు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై అద్భుత విజయాన్ని సాధించారు. భావ్ సింగ్‌ను అతని మిత్రులు, లంబాడి హక్కుల పోరాట సమితి (ఎల్‌హెచ్‌పీఎస్) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆంగోత్ చందూలాల్ అభినందించారు. చిన్నగూడూరు జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన భావ్ సింగ్, 2009లో వికలాంగుల కోటాలో బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ట్రిపుల్ ఐటీ పూర్తి చేసిన తర్వాత, ఉన్నత ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉండి పట్టుదలతో చదివారు. ఆయన రైల్వే శాఖలో జూనియర్ ఇంజనీర్ (జేఈ)గా, అలాగే నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టీపీసీ)లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన ఛత్తీస్‌గఢ్‌లోని కోర్బాలో ఎన్‌టీపీసీలో చేరారు. భావ్ సింగ్ ఘన విజయం పట్ల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, తండా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన సిరికొండ



అక్షర దర్బార్, శాయంపేట: మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి బుధవారం శాయంపేట మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. వివిధ గ్రామాలలో మృతి చెందిన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పత్తిపాక గ్రామానికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న నాముతాబాజీ అశోక్‌ను కూడా ఆయన పరామర్శించారు. ఆయన వెంట టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడుతున్న రైస్ మిల్లర్లు

- కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ధర్నా
- తరుగు పేరుతో రైతులను దోపిడీ చేయొద్దని డిమాండ్




అక్షరదర్బార్, హనుమకొండ: జిల్లాలో రైస్ మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయడంలో అధికారులు విఫలమయ్యారని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకుడిగా పాల్గొన్న భిక్షపతి మాట్లాడుతూ గత అనేక సంవత్సరాలుగా జిల్లాలో రైస్ మిల్లర్లు రైతులను తరుగు, తాలు, రవాణా పేరుతో ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా ప్రభుత్వాన్ని కూడా పెద్ద ఎత్తున మోసం చేస్తున్నారని, ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించడం లేదా సహకరించడం వల్లే ఇలా జరుగుతుందని అన్నారు. తరుగు రూపంలోనే రైతులకు కోట్లల్లో నష్టం వాటిల్లుతుందని, దీనికి రైస్ మిల్లులు మాత్రమే కాదు అధికారులు కూడా కారణమని అన్నారు. ఏడాది నుంచి సీఎంఆర్ పెట్టకుండా ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్న రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు ప్రజలు - ప్రభుత్వం కోసం పని చేస్తున్నారా, మిల్లర్ల కోసమా అని మండిపడ్డారు. జిల్లాలోని రైస్ మిల్లులను నెలకోసారి పౌరసరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తరుగు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులకు గన్నీ బ్యాగులను అవసరం మేరకు అందించాలని , సరిపడా లారీలను ఏర్పాటు చేసి రవాణా సమస్యలు రాకుండా చూడాలని, మొంథా తుఫానుతో దెబ్బతిన్న ధాన్యాన్ని నాణ్యత పేరుతో కొనుగోలు ఆపొద్దని డిమాండ్ చేశారు . ధర్నా అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా నాయకులు మద్దెల ఎల్లేశ్ , ఎదునూరి వెంకటరాజం, నేదునూరి రాజమొగిలి, కర్రె లక్ష్మణ్, కొట్టేపాక రవి, మునిగాల భిక్షపతి, జక్కు రాజు గౌడ్, ఈషబోయిన శ్రీనివాస్, అలువాల రాజు, రాజేందర్, దొమ్మటి ప్రవీణ్, జూకంటి పద్మ, కొట్టె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి: ఎస్ఐ రఘుపతి

అక్షర దర్బార్, ఖానాపురం : రాజీ మార్గమే రాజ మార్గమని, ఈ నెల 15న నర్సంపేట కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపురం సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) సిహెచ్ రఘుపతి సూచించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోర్టుల చుట్టూ తిరగడం వల్ల మానసికంగా, ఆర్థికంగా నష్టపోవడంతో పాటు కుటుంబ వ్యవస్థ కుంటుపడుతుందని ఎస్ఐ తెలిపారు. లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండబుల్, సివిల్, ఆస్తి, వైవాహిక వంటి రాజీ పడదగిన కేసులకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఇరు వర్గాలు రాజీపడితే సమస్య పరిష్కారం కావడంతో పాటు కక్షిదారుల విలువైన సమయం, డబ్బు ఆదా అవుతాయని పేర్కొన్నారు.



# మానవత్వంతో వైద్య సేవలు అందించండి

## వైద్య విద్యార్థులకు ఎంపీ కడియం కావ్య సూచన





అక్షర దర్బార్, భూపాలపల్లి: పేద, ధనిక తేడా లేకుండా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డా. కడియం కావ్య వైద్య విద్యార్థులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని వైద్య కళాశాలలో జరిగిన 'వైట్ కోట్ సెర్మనీ'లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ, తాను కూడా వైద్య విద్యనభ్యసించి గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. భవిష్యత్తులో మంచి వైద్యులుగా నిలబడాలంటే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొవాలని, ప్రేమతో సేవలు అందించి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, విద్యార్థులు వైద్య వృత్తిలో అనుభవాన్ని పొంది ప్రత్యేక వైద్యులుగా నిలవాలని కోరారు. ఈ ప్రాంత విద్య, వైద్య రంగాలకు సింగరేణి, కేటీపీపీ సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదివి, మానవత్వంతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. వెంకటేశ్వరరావు, సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, కేటీపీపీ సీఈ శ్రీ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీల ధర్మపోరాట దీక్ష రేపే

## రిజర్వేషన్లు 42% పెంచాలని ప్రధాన డిమాండ్



అక్షర దర్బార్, గూడూరు: బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ గూడూరులో రేపు (నవంబర్ 13) ధర్మపోరాట దీక్ష నిర్వహించనున్నట్లు బీసీజేఏసీ చైర్మన్ చీర బిక్షపతి, కన్వీనర్ కట్ల విష్ణు తెలిపారు. బుధవారం నిర్వహించిన ఏర్పాట్ల సమావేశంలో వారు మాట్లాడుతూ, దీక్షను బీసీ నాయకులు, కుల సంఘాల ప్రతినిధులు, ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెదకాసు కుమారస్వామి, ముక్తవరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



# సీతాకోకచిలుకల సింగిడి



## ఏటూరునాగారం అభయారణ్యంలో అధ్యయనం

**జీవవైవిధ్యానికి ప్రతీక. వందలాది రకాల జీవ జాతులకు ఆలవాలం. వేలాది వృక్ష జాతులకు పెట్టింది పేరు. ఒక రకంగా చెప్పాలంటే ఈ అటవీ ప్రాంతం ఒక్క ఈ జిల్లాకే కాకుండా చుట్టుపక్కల జిల్లాలకూ ఊపిరి తిత్తుల్లాంటివి. కాలుష్యం బారి నుంచి మానవాళిని కాపాడే సంజీవని లాంటివి. పక్షుల నుంచి క్షీరదాల వరకు అన్ని ప్రాణులకు ప్రాణవాయివును అందించే ఆరోగ్యగని. అలాంటి అటవీ ప్రాంతం గురించి తాజాగా ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఏటూరునాగారం వన్యప్రాణుల అభయారణ్యంలో సుమారు 80 రకాల అరుదైన సీతాకోక చిలుకలు ఉన్నట్లు వరల్డ్ వైల్డ్ ఫర్ నేచర్ సంస్థ గుర్తించింది. ఆ..... గుర్తిస్తే ఏంటంట..? అని తీసిపారేయకండి. ఆ జాతులు ఉండటం జీవవైవిధ్యం పరిఢవిల్లుతుందనడానికి సంకేతం. ఇంతకీ ఆ విశేషాలెంటో తెలుసుకుందామా!**

**అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి :**
అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి: ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో, అటవీ శాఖ పర్యవేక్షణలో ఇటీవల ఏటూరు నాగారం అభయారణ్యంలో అద్భుతమైన సర్వే జరిగింది. సర్వేలో మొత్తం ఎనిమిది రాష్ట్రాల నుంచి వరల్డ్ వైల్డ్ ఫర్ నేచర్ వంటి సంస్థల నుంచి 60 మందికి పైగా నిపుణులు, పర్యావరణవేత్తలు, విద్యార్థులు, ఫొటోగ్రాఫర్లు ప్రత్యేక సర్వేలో భాగస్వాములయ్యారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సర్వేలో బృందం లక్నవరం, తాడ్వాయి, పస్రా అటవీ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించింది. ఎన్నో పరిశోధనలు జరిపింది. పరిశోధనలో ఈ ప్రాంతంలో సుమారు 80 రకాల అరుదైన సీతాకోకచిలుకల జాతులను గుర్తించింది. ఇంత భారీ స్థాయిలో కొత్త జాతులను గుర్తించడం ములుగు అడవుల జీవవైవిధ్యానికి దర్పణమని అటవీశాఖ స్పష్టం చేసింది.

- వరల్డ్ వైల్డ్ ఫర్ నేచర్ సంస్థ పరిశోధన
- మూడురోజుల పాటు 60 మంది బృందం పర్యటన
- 80 అరుదైన జాతుల బటర్ ఫ్లైస్ గుర్తింపు
- జీవవైవిధ్యం పరిఢవిల్లుతుందని ప్రకటన
- ఫలిస్తున్న అటవీశాఖ కార్యాచరణ

### ఎందుకు ప్రత్యేకం?

సీతాకోకచిలుకల జాతుల గుర్తింపు అనేది ఒక క్లిష్టమైన ప్రక్రియ. 60 మంది నిపుణుల బృందం అటవీ ప్రాంతంలో పర్యటించేందుకు ఎన్నో వ్యయప్రయాసలకోర్చింది. సీతాకోకచిలుకల జాడను గుర్తించేందుకు చలిలో తెల్లవారుజామునే దట్టమైన అటవీ ప్రాంతానికి చేరుకునేది. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, మళ్లీ సాయంత్రం 2 గంటల నుంచి 5 గంటల వరకు పర్యటించి పరిశోధన చేసింది. ఈ సమయంలో అక్కడ సంచరించే సీతాకోక చిలుకలపై అధ్యయనం చేసింది. వాటి ఆహారపు అలవాట్లు, వాటి రంగులు, రెక్కల పైన ఉండే ప్రత్యేకమైన డిజైన్లు, వాటి ఆకారం, పరిమాణాలను ఇతర ప్రాంతాలకు చెందిన జాతులతో పోల్చిచూసింది. వాటి జీవన స్థితిగతులను ఫొటోలు, వీడియోల రూపంలో డాక్యుమెంట్ చేసింది. ఇలా ఈ ప్రాంతంలో మొత్తం 80 రకాల అరుదైన జాతులు ఉన్నట్లు గుర్తించింది. ఈ ప్రక్రియలో సీతాకోకచిలుకల గుడ్లు పెట్టే అరుదైన మొక్కలను, అవి మకరందాన్ని సేకరించే మొక్కలను సైతం పరిశోధకులు గుర్తించారు. అటవీ ప్రాంతంపై అటవీశాఖ అమలు చేస్తున్న కార్యాచరణ విజయవంతం కావడంతోనే సక్సెస్ అనేది వేరే చెప్పనక్కర్లేదు.

### - ఏమిటి లాభం?

మన పక్కనే ఉన్న అటవీ ప్రాంతంలో ఇన్ని రకాల సీతాకోకచిలుకల జాతులు సమృద్ధిగా ఉండటం పర్యావరణ సమతుల్యతకు సంకేతం. జీవవైవిధ్యం సజావుగా సాగుతుందనడ ◌ానికి బలమైన సానుకూల సంకేతం. సజీవ సాక్ష్యం. సీతాకోకచిలుకలను పర్యావరణ శాస్త్రవేత్తలు బయో ఇండెక్స్ లేదా సూచికగా పరిగణిస్తారు. ఎందుకంటే సీతాకోక చిలుకలు వాతావరణ మార్పులు, కాలుష్యం వంటి చిన్న మార్పులకు స్పందిస్తాయి. అధిక సంఖ్యలో, వైవిధ్యంగా ఉన్న సీతాకోకచిలుకల జాతులు ఆ అడవిలో పుష్కలమైన పూల మొక్కలు, ఆరోగ్యకరమైన వృక్షసంపద ఉన్నట్లు సూచిస్తాయి. సీతాకోకచిలుకలు పూల పరాగ సంపర్కంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఇవి మొక్కల పునరుత్పత్తిలో ఎంతో దోహదపడతాయి. ఆ ప్రక్రియ పూర్తయితేనే అటవీ ప్రాంతంలో పండ్ల చెట్లు పూత వేస్తాయి. తద్వారా పండ్లు కాస్తాయి. రేపటికి విత్తనాలు లభ్యమవుతాయి. వాటిపై ఆధారపడి పక్షులు, తొండలు, బల్లుల వంటి జీవజాతులు మనుగడ సాగించగలుగుతాయి.


# సినీ స్టార్ నాగార్జునకు మంత్రి సురేఖ క్షమాపణలు

## గతంలో నేను ఉద్దేశ పూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదు

## నా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా

## ఎక్స్ ద్వారా ప్రకటించిన మంత్రి





అక్షరదర్బార్, హైదరాబాద్: 'సినీ స్టార్ నాగార్జున, ఆయన కుటుంబాన్ని బాధ పెట్టాలనే ఉద్దేశంతో నేను ఆ వ్యాఖ్యలు చేయలేదు. వారిని ఇబ్బందిపెట్టాలని కాని, వారి పరువు-ప్రతిష్టలకు భంగం కలిగించాలన్నది కాని నా ఉద్దేశం కాదు. నాగార్జున కుటుంబంపై నేను చేసిన వ్యాఖ్యల్లో ఏదైనా పొరపాటు ఉంటే అందుకు చింతిస్తున్నా. నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా` అంటూ మంత్రి కొండా సురేఖ తాజాగా ఎక్స్ ద్వారా క్షమాపణలు చెప్పారు. ఈ పోస్ట్‌లో మంత్రి తన మాటలు పూర్తిగా వెనక్కి తీసుకుంటున్నానని పేర్కొన్నారు. సినీ స్టార్ నాగార్జున మునుపటి కోడలు నటి, సమంతను ఉద్దేశిస్తూ 2024 అక్టోబర్ 1న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై విమర్శలు గుప్పిస్తూ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. దీంతో నాగార్జున కోర్టును ఆశ్రయించారు. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై రూ.వంద కోట్ల పరువు నష్టం దాఖలు చేశారు. మరోవైపు కేటీఆర్ కూడా పరువు నష్టం పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్లపై విచారణకు నాగార్జున సహా ఆయన కుటుంబసభ్యులు, వాంగ్మూలాలు ఇచ్చారు. కోర్టులో వ్యతిరేకంగా తీర్పు ఇస్తుందన్న కారణంగా కొండా సురేఖ రాత్రికి రాత్రి క్షమాపణలు చెప్పినట్లుగా తెలుస్తోంది. ఇలాంటి కేసుల్లో తప్పు చేసిన వారు క్షమాపణ చెప్పకపోతే .. ఆ వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నట్లుగా ప్రకటించకపోతే కోర్టు నిర్ణయం ప్రకటిస్తుంది. ఇప్పుడు సురేఖ బేషరతుగా క్షమాపణలు ప్రకటించడం వల్ల నాగార్జున కుటుంబం సంతృప్తి చెంది కేసులో రాజీపడిపోయే అవకాశం ఉందా.. లేదా అనేది వేచి చూడాల్సిందే.

# ఏజెన్సీలో అక్రమ పట్టాలు రద్దు చేయాలి

## 1/70 చట్టాన్ని కాలరాస్తున్నారు: జీఎస్‌పీ

అక్షర దర్బార్, వెంకటాపురం (నూగూరు): ఏజెన్సీ ప్రాంతంలోని వెంకటాపురం మండలంలో గిరిజనేతరులకు అక్రమంగా మంజూరైన పట్టాలను వెంటనే రద్దు చేయాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ (జీఎస్‌పీ) రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు తాసిల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. మరికాల (జెడ్) గ్రామంలో 1/70 చట్టానికి విరుద్ధంగా అధికారులు పట్టాలు ఇచ్చారని ఆయన ఆరోపించారు. అవినీతి అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి ఏజెన్సీ చట్టాలను కాలరాస్తున్నారని మండిపడ్డారు. దీనిపై కలెక్టర్ విచారణ జరిపి అక్రమ పట్టాలను రద్దు చేసి, ఆ భూమిని నిరుపేద ఆదివాసీలకు కేటాయించాలని సాయి డిమాండ్ చేశారు.



# 14న అప్రెంటిస్ మేళా

అక్షరదర్బార్, హనుమకొండ: హనుమకొండ పైడిపల్లిలోని విజ్ఞాన్ ఐటిఐ ఆధ్వర్యంలో ఈ నెల 14న అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు విజ్ఞాన్ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం కొమురయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిఐ పాసైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు. ఈ అప్రెంటిస్ మేళాకు ప్రముఖ కంపెనీ లైన తోషిబా, టాటా వంటి కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. శుక్రవారం కళాశాల వద్ద జరిగే మేళాలో పాల్గొనే అభ్యర్థులు తమ వెంట ఎస్సెస్సీ, ఆధార్, పాన్, ఐటిఐ, ఎన్ సీవీటీ, సర్టిఫికెట్స్ తీసుకుని ఉదయం పది గంటలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ కోరారు.

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

## ఎస్సైలు గోవర్ధన్, రఘుపతి సూచన

అక్షర దర్బార్, నల్లబెల్లి/ఖానాపురం: ఈ నెల 15న నర్సంపేట కోర్టులో నిర్వహించనున్న లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నల్లబెల్లి ఎస్సై వి. గోవర్ధన్, ఖానాపురం ఎస్సై సిహెచ్ రఘుపతి సూచించారు. బుధవారం వారు వేర్వేరుగా మాట్లాడుతూ, రాజీ మార్గమే రాజ మార్గమని అన్నారు. కోర్టుల చుట్టూ తిరిగితే మానసికంగా, ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. క్రిమినల్ కాంపౌండబుల్, సివిల్, ఆస్తి, వైవాహిక సంబంధిత రాజీ పడదగిన కేసులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఇరువర్గాలు రాజీ పడడం వల్ల విలువైన సమయం, డబ్బు ఆదా అవుతాయని వారు స్పష్టం చేశారు.